సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



శివారు భూమికీ నీరు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రైతులకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది.

IIలో ▸



అమ్మవారి సన్నిధిలో..

సాక్షి, భీమవరం: స్థానిక త్యాగరాజ భవనంలో ధనలక్ష్మి అలంకరణలో ఉన్న వాసవీ మాతను గురువారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు దర్శించుకున్నారు.

భీమవరం ఆర్డీఓ బదిలీ



సాక్షి, భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీలో భాగంగా భీమవరం ఆర్డీఓ దాసి రాజు కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కె.శ్రీనివాసులురాజు ఇక్కడకు రానున్నారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు : జేసీ



సాక్షి, భీమవరం: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు చేపట్టామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించి సొమ్ములను వారి ఖాతాల్లో జమచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణపై కస్టోడియన్ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో అవగాహన, శిక్షణా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గతంలో 150 మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఉండగా.. రైతుల సౌలభ్యార్థం 314 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం మండలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం కాగా దశల వారీగా విస్తరిస్తామన్నారు. డివిజన్, మండలాలు వారీగా కస్టోడియన్ అధికారులు, రైతు భరోసా కేంద్రాలు, టెక్నికల్ సిబ్బంది, హెల్పర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ధాన్యం రవాణాకు 3,900 వాహనాలు అవసరమవుతాయని గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దళారులు, రైస్‌మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకూడదని సూచించారు. ధాన్యం విక్రయాల్లో రైతులకు, మిల్లర్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, అన్‌లోడింగ్ వంటి వాటిని కస్టోడియన్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించి మద్దతు ధరపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, కస్టోడియన్ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పాలకోడేరులో ‘జగనన్నకు చెబుదాం’

పాలకోడేరు: పాలకోడేరు మండలపరిషత్ కార్యాలయంలో ‘జగనన్నకు చెబుదాం ’ మండల స్థాయి కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నూకల మురళి గంగాధరరావు తెలిపారు. కలెక్టర్ ,జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలను, ఫిర్యాదులను అందజేయవచ్చని ఆయన సూచించారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

భీమవరం (ప్రకాశంచౌక్): సచివాలయం ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టరు ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఉండి మండలం పెదపుల్లేరు గ్రామ సచివాలయంలో అమలు చేస్తున్నామన్నారు. రెండో విడతలో జిల్లాలోని 17 గ్రామ సచివాలయాలను ఎంపిక చేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించామని, మూడో దశలో 51 గ్రామ సచివాలయాలను ఎంపిక చేశామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు త్వరలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామని జేసీ రామసుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్లు జి.శివయ్య, పి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఎం. భూషణం, పి.రుక్మిణి పాల్గొన్నారు.

అక్రమ రవాణా నిర్మూలనకు ప్రచార భేరి

భీమవరం(ప్రకాశం చౌక్): భారత దేశ రైల్వే బోర్డ్ దేశవ్యాప్తంగా సామాజిక రుగ్మతగా భావిస్తున్న మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రజలందరికీ సంపూర్ణ అవగాహన కల్పించాలని రైల్వే పోలీస్ ఫోర్స్ ద్వారా ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రైల్వే అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ అందే రామాంజనేయులు తెలిపారు. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలతో కలిసి గురువారం మానవ అక్రమ రవాణా నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే దస్తగిరి మాట్లాడుతూ ఎవరైనా మానవ అక్రమ రవాణాకు పాల్పడితే 139 నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటారన్నారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలనకు సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రతిజ్ఞ నిర్వహించి ఇటువంటి రుగ్మతలను ఎదుర్కొనేందుకు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీడబ్ల్యూఐ నిడదవోలు ఎస్సై సీహెచ్ రాజేశ్వరరావు, ఆర్‌పీఎఫ్ ఎస్సై ఏపీఎస్ చౌదరి, ఏఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వినోదిని.. విష్ణు విలాసిని



భీమవరం (ప్రకాశం చౌక్): ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత



పాలకొల్లు (సెంట్రల్): క్షీరారామంలో..

అయిగిరి నందిని నందితమేదిని విశ్వవినోదిని నందినుతే.. స్మరణలు మార్మోగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా శ్రీదేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరుగుతున్నాయి.

-సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారు



తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మవారు

పట్టణ ఆరోగ్యానికి రక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

- పట్టణాల్లో వార్డుల వారీగా క్యాంపులు
- విజయవంతంగా నిర్వహణ
- ప్రజల నుంచి విశేష స్పందన
- 121 వార్డుల్లో వైద్యసేవలు
- 50 వేల మందికి పైగా ఆరోగ్య పరీక్షలు

జిల్లాలో పట్టణాలు	6
వార్డులు	190
క్యాంపుల నిర్వహణ	121
వైద్యసేవలు	59,200 మందికి
ఉన్నత వైద్యానికి సిఫార్సు	1,500 మంది
మందుల పంపిణీ	57,500 మందికి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి ప్రజలకు స్థానికంగానే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా వైద్య శిబిరాల నిర్వహణ పశ్చిమ గోదావరి జిల్లాలోని పట్టణాల్లో విజయవంతంగా సాగుతోంది. మొదట్లో పట్టణాల్లో ఒకేచోట 2, 3 వార్డులు కలిపి క్యాంపులు నిర్వహించారు. అయితే వార్డువార్డునా క్యాంపులు నిర్వహించాలని సీఎం జగన్ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వార్డుల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించడంతో పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. స్పెషలిస్ట్ వైద్యుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లాలోని ఆరు పట్టణాల్లో.. జిల్లాలోని ఆరు పట్టణాల్లో 190 వార్డులు ఉండగా ఇప్పటివరకు 121 వార్డుల్లో సురక్ష శిబిరాలు పూర్తయ్యాయి. 59,200 మంది వైద్యసేవలు పొందగా 1,500 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 57,500 మందికి మందులు పంపిణీ చేశారు. సుమారు 50 వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.



తణుకులో వైద్య సేవలందిస్తున్న వైద్యులు (ఫైల్)



భీమవరంలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ప్రజలు (ఫైల్)

స్పెషలిస్టుల సేవలు : వార్డుల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు స్పెషలిస్ట్ వైద్యులు హాజరవుతున్నారు. ఆరోగ్యశ్రీ, వైద్యవిధాన పరిషత్ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులు సేవలందిస్తున్నారు. ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసన్, గుండె వ్యాధులు, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, మానసిక వైద్యులు, మత్తు వైద్యులు, కంటి వైద్యులు, ల్యాబ్, మైక్రో బయాలజీ తదితర స్పెషలిస్టులు సేవలు అందిస్తున్నారు. ప్రతి క్యాంపులో ముగ్గురు స్పెషలిస్ట్, ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు సేవలందిస్తున్నారు.

14 రకాల పరీక్షలు : జగనన్న సురక్ష క్యాంపులకు వచ్చే వారికి ఉచితంగా 14 రకాల పరీక్షలు చేసి 23 రకాల మందులను అందిస్తున్నారు.

- **తణుకు:** తణుకులో 34 వార్డులు ఉండగా 14 వార్డుల్లో క్యాంపులు పూర్తయ్యాయి. మొత్తం 3 వేల మందికి వైద్యసేవలు అందించగా 250 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 2,700 మందికి మందులు అందజేశారు.
- **తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెంలో 35 వార్డులు ఉండగా 11 వార్డుల్లో క్యాంపులు పూర్తయ్యాయి. 2 వేల మందికి వైద్య సేవలు అందించగా 200 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 3,000 మందికి మందులు అందజేశారు.
- **భీమవరం:** భీమవరంలో 39 వార్డులు ఉండగా 20 వార్డుల్లో క్యాంపులు పూర్తయ్యాయి. 10 వేల మందికి వైద్య సేవలు అందించగా 300 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 9,500 మందికి మందులు అందజేశారు.
- **పాలకొల్లు:** పాలకొల్లులో 31 వార్డులు ఉండగా 26 వార్డుల్లో క్యాంపులు పూర్తయ్యాయి. 10 వేల మందికి వైద్య సేవలు అందించగా 200 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 9,800 మందికి మందులు అందజేశారు.
- **నరసాపురం:** నరసాపురంలో 31 వార్డులు ఉండగా అన్నిచోట్లా క్యాంపులు పూర్తయ్యాయి. సుమారు 50 వేల మందికి వైద్య సేవలు అందించగా 400 మందికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 46 వేల మందికి మందులు అందజేశారు.
- **ఆకివీడు:** ఆకివీడులో 20 వార్డులు ఉండగా అన్నిచోట్లా క్యాంపులు పూర్తయ్యాయి. 3 వేల మందికి వైద్య సేవలు అందించగా 150 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. 2,900 మందికి మందులు అందజేశారు.

వార్డువార్డునా శిబిరాల నిర్వహణ



“ జిల్లాలోని పట్టణాల్లో అన్ని వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకూ 121 క్యాంపులు పూర్తయ్యాయి. నరసాపురం, ఆకివీడులో నూరుశాతం శిబిరాల నిర్వహణ పూర్తయ్యింది. 59 వేల మందికి పైగా సేవలందించాం. స్పెషలిస్టు వైద్యుల సేవలతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పట్టణ ప్రజలు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.

– పి.ప్రశాంతి, కలెక్టర్

9,698 మందికి జగనన్న చేదోడు

రూ.9.70 కోట్ల మేర లబ్ధి : కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): కులవృత్తిదారులకు అండగా ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం అమలు చేస్తోందని, నాల్గో విడతలో జిల్లాలో 9,698 మందికి రూ.9.70 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి సీఎం జగన్ ప్రారంభించిన జగనన్న చేదోడు కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుచి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, అధికారులతో కలిసి వర్చ్యువల్‌గా వీక్షించిన అనంతరం జిల్లాలో లబ్ధిదారులకు కలెక్టర్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కుల వృత్తి చేసుకునే రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున ఇప్పటివరకూ రూ.40 వేల అందించారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2020–21లో 26,372 మందికి రూ.26.37 కోట్లు, 2021–22లో 23,380 మందికి రూ.23.38 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. నూతన పశ్చిమగోదావరి జిల్లాలో 2022–23లో 10,348 మందికి రూ.10.35 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు నిష్పక్షపాతంగా పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారు. చేదోడు లబ్ధిని వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1,152 మందికి, భీమవరంలో 1,201 మందికి, నరసాపురంలో 835 మందికి, పాలకొల్లులో 1,155 మందికి, తాడేపల్లిగూడెంలో 1,823 మందికి, తణుకులో 1,945 మందికి, ఉండిలో 1,190 మందికి, గణపవరం మండలంలో 397 మందికి చేదోడు లబ్ధి చేకూర్చారన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, బీసీ కార్పొరేషన్ ఏఈ కె.ప్రమీల రాణి, టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోపిల్ల రామకోటేశ్వరరావు, ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.గోగురాజు, ఏపీ తూర్పు కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మల్లు వీరరాఘవమ్మ, టైలర్స్ అసోసియేషన్ టౌన్ సెక్రటరీ కె.త్రినాథ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

● డిప్యూటీ సీఎం కొట్టుకు సీఎం శుభాకాంక్షలు



ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తన పుట్టినరోజు సందర్భంగా గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

- తాడేపల్లిగూడెం అర్బన్

రాష్ట్రంలో వైద్య విప్లవం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి

యలమంచిలి: దేశ చరిత్రలో మొదటిసారిగా ఆరోగ్యశ్రీ పేరిట రాజన్న ప్రవేశపెట్టిన వైద్య విప్లవాన్ని ఆయన వారసుడిగా జగనన్న కొనసాగిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రసాదరాజు స్వగ్రామం కలగంపూడిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు 5 కోట్ల మందికి ఆరోగ్య సేవలు అందించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సేవలందిస్తున్న అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు సుమారు 100 మందిని పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు నాయకత్వంలో సన్మానించారు. సర్పంచ్ పాత్తూరి విష్ణుప్రియ, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జిల్లా యువజన నాయకులు ఉచ్చుల స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోనం బులి వెంకన్న, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి


కౌశల్ పరీక్షకు నోటిఫికేషన్

సాక్షి, భీమవరం: కౌశల్ క్విజ్ పరీక్ష–2023కు నోటిఫికేషన్ విడుదలైనట్టు పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో కౌశల్–2023 పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. క్విజ్ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9,10 విద్యార్థులు జట్టుగా ఏర్పడాలన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక, నగదు పురస్కారం అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9492566794లో సంప్రదించాలన్నారు. డీవైఈఓ డి.శ్రీరామ్, సూపరింటెండెంట్ తిరుపతిరాజు, కౌశల్ జిల్లా సమన్వయ కర్త ఆర్‌వీ సూర్యనారాయణ, జాయింట్ సమన్వయకర్త ఎం.నారాయణరాజు పాల్గొనారు.

701 మందికి టిడ్కో ఇళ్లు అందజేత

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో 701 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలు, తాళాలు అందజేశామని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మిగిలిన టిడ్కో లబ్ధిదారులకు డిసెంబర్ నాటికి ఇళ్లను అందజేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయంలో హైస్కూల్, కేఎస్ఎన్ కాలనీలో యూపీ పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నన్నయ క్యాంపస్‌లో అతి త్వరలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. ఎడ్యుకేషనల్ హబ్‌గా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగేలా మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలన్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.150 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. దోమల నివారణ, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిమిత్తం రూ.130 కోట్లతో పనులు చేయనున్నామన్నారు. రెండో వేసవి జలాశయ పనులను ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామన్నారు. పెంటపాడు మండలం, ఉంగుటూరు నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతాల వరకు రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించనున్నట్టు చెప్పారు. నవాబుపాలెం నుంచి త్యాజంపూడి వరకు ఎర్రకాలువను అనుసంధానం చేస్తూ రహదారులు, హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. శాంతిభద్రతలు, అధికారులతో పూర్తి స్థాయిలో పనిచేయించే విషయంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, వైఎస్సార్ సీపీ పాలనను ప్రజలంతా మరోమారు బలపర్చాలని కోరారు. దేవదాయశాఖ తనకెంతో సంతృప్తినిచ్చిందని, స్వయం ప్రతిపత్తితో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోగలిగామన్నారు. దేవదాయ చట్టంలో 83వ సెక్షన్‌ను సవరిస్తూ చట్టం తీసుకురావడం ద్వారా దేవుడు భూములకు రక్షణ కల్పించామన్నారు. జీర్ణావస్థకు చేరిన ఆలయాల పునర్నిర్మాణం, శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాల నిర్మాణం, నిత్య ధూపదీప నైవేద్య పథకాలు అమలు చేయగలిగామన్నారు. పట్టణంలో కొత్తగా రైల్వే ఓవర్ బ్రిడ్జి తీసుకురానున్నామని చెప్పారు. కొత్త ప్రాజెక్టులతో నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు.



టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాసేవకే పోలీస్ అంకితం

అమరవీరుడు నరేంద్రకు ఘన నివాళి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటామనీ, దుండగుడి దాడిలో మరణించిన ఆగిరిపల్లి స్టేషన్ కానిస్టేబుల్ గంధం నరేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కానిస్టేబుల్ గంధం నరేంద్ర చిత్రపటానికి ఎస్పీ మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, నరేంద్ర భార్య, పిల్లలు, వారి కుటుంబ సభ్యులు, నూజివీడు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఆగిరిపల్లిలో దుండగుడి దాడిలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ కన్నుమూసిన కానిస్టేబుల్ కుటుంబానికి పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్ ఆధ్వర్యంలో రూ.1,31,020 ఆర్థిక సహాయాన్ని, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఆర్థిక సహాయాన్ని చెక్కుగా నరేంద్ర కుటుంబానికి ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగం పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత గల కానిస్టేబుల్ నరేంద్ర మృతి పోలీస్ శాఖకు తీరనిలోటన్నారు. ఏఎస్పీ భాస్కరరావు మాట్లాడుతూ నరేంద్ర భార్యకి కారుణ్య నియామకంలో ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వానికి నివేదించామన్నారు.

క్లుప్తంగా

సేంద్రియ సాగుతో ప్రయోజనాలెన్నో



మార్టేరులో మాట్లాడుతున్న ఏడీఆర్ భరత లక్ష్మి

పెనుమంట్ర: తక్కువ పెట్టుబడితో సేంద్రియ వరి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఏడీఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి అన్నారు. గురువారం మార్టేరులోని వ్యవసాయ పరిశోధన సంస్థలో గోదావరి జిల్లాల సుస్థిర వరి వ్యవసాయానికి ప్రణాళిక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ రైతులు భవిష్యత్తులో స్వల్పకాలిక, అధిక దిగుబడులు పొందేందుకు వీలుగా పంటలు పండించుకోవాలన్నారు. విజయవాడ కోరమండల్ జోనల్ మేనేజర్ ఎం.సత్యానందరెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తమ కంపెనీ రెండో స్థానంలో ఉందన్నారు. వరి ప్రథమ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, విజయవాడ కోరమండల్ డివిజనల్ మేనేజర్ ఎం.మోహన్‌కుమార్, రాజమండ్రి విత్తన సర్టిఫికెట్ అధికారి ఎ.భార్గవరావు, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త ఆర్గనైజర్ డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఫౌండ్రీ వర్కర్ మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఫౌండ్రీ వర్కర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన బండి సూరిబాబు ఫౌండ్రీ పని చేసుకుని జీవిస్తుంటాడు. ఈ నెల 15న ఫౌండ్రీ సామగ్రి, కూరగాయలు కొనుగోలు కోసం ద్విచక్రవాహనంపై భీమవరం బయలుదేరాడు. ఉండి మండలం చెరుకువాడలో రైస్ మిల్లు వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ చెప్పారు.

శివారు భూమికీ నీరు

- జిల్లాలో గత రెండు నెలల్లో 60 శాతం తగ్గిన వర్షపాతం
- వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్‌కు సాగునీటి కొరత లేకుండా చర్యలు
- పంట కాలువలకు రెట్టింపు మేర 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల



పంటకాలువలో కర్రనాచు తొలగిస్తున్న కూలీలు



నిండుగా ప్రవహిస్తున్న నర్సాపురం కాలువ



పెనుగొండ: జిల్లాలో గత నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రైతులకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శివారు ప్రాంతాల్లో సైతం సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు పూర్తిగా పడినా ఆఖరి వారం నుంచి వరుణుడు మొఖం చాటేశాడు. అక్టోబర్‌లోనూ ఇదే పరిస్థితి. దీనికి తోడు పెరిగిన ఉష్ణోగ్రతలతో వరి చేలల్లో నీరు అడుగంటుతూ తడి ఆరిపోతున్నాయి. దీంతో చివరి ఎకరాకూ నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా విజ్జేశ్వరం నుంచి ప్రధాన కాలువల్లోకి గోదావరి జలాలను సాగు కోసం విడుదల చేస్తుంటారు. ప్రతి ఏటా సాగుకు వర్షాకాలంలో 3 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంటారు. దీనిలో గోదావరి తీర ప్రాంతాలైన పెరవలి, పెనుగొండ, ఆచంట, పోడూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాలకు కోడేరు బ్యాంకు కెనాల్ ద్వారా 1200 నుంచి 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంటారు. అయితే సెప్టెంబర్ నెలాఖరు నుంచి అక్టోబర్ నెలలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిస్ నుంచి ఏడు వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నారు. దీనిలో కోడేరు బ్యాంకు కెనాల్‌కు కాకరపర్రు లాకుల నుంచి 2,500 క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నారు.

తొలగిన కర్ర నాచు ఇబ్బందులు

గత సీజన్‌లో సీలేరు నుంచి కాలువలకు నీటిని విడుదల చేయడంతో ప్రధాన కాలువల్లోనూ, పంట కాలువల్లోనూ కర్ర నాచు విపరీతంగా పెరిగి శివారు

నెల	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షం
సెప్టెంబర్	185.5 మి.మీ	175.3 మి.మీ
అక్టోబర్	154.1 మి.మీ	16.5 మి.మీ

ప్రాంతాలకు నీరు పారక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కర్ర నాచు తొలగించేందుకు నీటి పారుదల శాఖాధికారులు చర్యలు చేపట్టారు. గత ఏడాది కోడేరు బ్యాంకు కెనాల్‌లో కర్రనాచు తొలగింపునకు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో పూర్తి చేశారు. ఇదేవిధంగా శెట్టిపేటలో పాతలాకులు గోడల తొలగింపునకు కృషి చేయడంతో నీటి పారుదలకు ఇబ్బందులు తప్పాయి. ఈ ఏడాది నీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే పలు ప్రాంతాల్లో కర్రనాచు తొలగింపు పనులు పూర్తి చేశారు.

మరో 20 రోజులు గడిస్తే పంట చేతికి..

డెల్టాలో ప్రస్తుతం వరి చేలు ఈనిక దశలో ఉన్నాయి. వీటికి మరో రెండు మూడు తడులు అవసరం. మరో 20 రోజుల పాటు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటే రైతులు పూర్తి స్థాయిలో గట్టెక్కుతారు. ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితి ఉన్నా నీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే మరో 20 రోజుల పాటు నీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరో రెండు తడులు ఇస్తే చాలు



వర్షాలు కురవకపోయినా నీటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించారు. నెల రోజులుగా వర్షాలు కురవక పోవడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో నీటి అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించిన ప్రభుత్వం మరో రెండు మూడు తడులు 15 రోజుల వరకు అందేలా చర్యలు తీసుకుంటే పంట చేతికొస్తుంది.

– చిన్నం వెంకట రామకృష్ణా రెడ్డి, రైతు, పెనుగొండ

సాగునీటి సరఫరాకు ఇబ్బందుల్లేవు

సాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గోదావరిలో 3 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉన్నాయి. శివారు చేలకూ ఇబ్బందులు లేకుండా కర్రనాచు తొలగింపు పనులు చేపట్టాం. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాలు లేక పోవడంతో 7 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేశాం.

– సీహెచ్ సత్యనారాయణ, డీఈ, నీటి పారుదల శాఖ, నర్సాపురం

రైతు ఫ్రెండ్లీ విధానంలో ధాన్యం కొనుగోలు

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- ఏలూరులో జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ధాన్యం కొనుగోలులో అధికారులు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 'రైతు ఫ్రెండ్లీ' విధానంలో ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరులోని జెడ్పీ కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాల్లో వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్ముకునే సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అంచనా ఉందని, ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద తేమ, నూక శాతం లెక్కింపులో వ్యత్యాసం ఉంటోందని, చిరిగిపోయిన గోనెసంచుల అందిస్తున్నారని, రవాణాకు వాహనాల ఏర్పాటులో కూడా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటన్నింటినీ అధిగమించి రైతులు మిల్లర్ల నుంచి ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా కస్టోడియన్ అధికారులు మరింత బాధ్యతతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవిని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఆదేశించారు. ప్రతి మండలంలోనూ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ఏర్పాటు చేసి, రైతుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖాధికారులను ఛైర్‌పర్సన్ ఆదేశించారు. ప్రస్తుత సీజన్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పెదపాడు, కైకలూరు, తదితర మండలాలకు చెందిన శివారు భూములకు కృష్ణా కాలువ నుంచి సాగు, తాగునీరు సక్రమంగా అందడం లేదని, వంతులవారీ విధానాన్ని సక్రమంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జెడ్పీటీసీ, ఎంపీపీలను సమన్వయం చేసుకుని మరింత వేగవంతం చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు పరిసర ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు కొంతమంది ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని గనుల శాఖ డీడీని ఛైర్‌పర్సన్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా నూరుశాతం ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

గైర్హాజరైతే చర్యలకు సిఫారసు చేస్తాం

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించే జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు, హాజరుకాని జిల్లా అధికారులపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ హెచ్చరించారు. ఏలూరులో గురువారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలకు సంబంధించి కొందరు జిల్లా అధికారులు హాజరు కాకుండా కింద స్థాయి అధికారులను పంపడంపై పద్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్లు శ్రీలేఖ, విజయబాబు, జేడీఏ వై.రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



విజయవాడ దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు వెళుతున్న ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ట్రస్టుబోర్డు సభ్యులు

ద్వారకాతిరుమల: విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గమ్మకు చినవెంకన్న దేవస్థానం తరపున గురువారం పట్టువస్త్రాలను సమర్పించారు. వాటిని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, ఆచంట అనసూయ సురేష్, పాలా వెంకటేశ్వరరావు, వాసే రామకృష్ణ, గంటి చినసర్వేశ్వరరావు, తానంకి గంగరాజు, అమ్మాజీ, గుర్రం సూర్యవతి, నూకల అమ్మాజీ, తొమ్మండ్రు రమేష్, శ్రీనివాసరావు తదితరులు అందజేశారు. ముందుగా పట్టువస్త్రాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులను మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం శ్రీవారి దేవస్థానం ఈఓ త్రినాథరావు, తదితరులకు అర్చకులు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, దుర్గగుడి ఛైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి దేవస్థానం ఏఈఓ వాసు, ఆర్.లక్ష్మణస్వామి, సూపరింటెండెంట్ మద్దాల శ్రీను తదితరులున్నారు.

108 వాహనంలో గిరిజన మహిళ ప్రసవం



వాహన సిబ్బంది నుంచి ఆడబిడ్డను చేతిలోకి తీసుకున్న వైద్య సిబ్బంది

జంగారెడ్డిగూడెం: పురిటినొప్పులతో 108 వాహనంలో ఆసుపత్రికి వస్తూ మార్గమధ్యలో కాన్పు జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చిందో మహిళ. వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయిగూడెం మండలం పాతరాజానగరం గ్రామానికి చెందిన వెట్టి రమ్యకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో నొప్పులు ఎక్కువయ్యాయి. 108 వాహనంలో పాత రాజానగరం నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి 36 కిలోమీటర్లు ప్రయాణించి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అధికంగా నొప్పులు రావడంతో ఏరియా ఆసుపత్రి గేటు వద్దకు వచ్చేసరికి రమ్యకు ప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ఒక పక్క ఆసుపత్రికి తీసుకువస్తూనే నొప్పులు ఎక్కువగా ఉన్న రమ్యకు 108 సిబ్బంది వైద్యసేవలు అందించడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రసవం జరిగినట్లు రమ్య కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా 108 వాహన ఈఎంటీ రామ్‌ప్రసాద్, పైలెట్ బుడిప్పుడి సతీష్‌కుమార్‌లకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలపగా, సిబ్బందిని పలువురు అభినందించారు.

● గడపగడపకు సంక్షేమం



వీరవాసరం : జొన్నలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కాళ్ల : ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

నవంబర్ నాటికి రీసర్వే పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): మూడో విడత రీసర్వే పనులను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం, రీసర్వే, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మూడో దశ రీసర్వే పనులను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే నవంబర్ నెలాఖరు నాటికి సర్వే రాళ్లు వస్తాయని, వాటిని డిసెంబర్ నాటికి పాతి రైతులకు సరిహద్దులను చూపించాలన్నారు. రీసర్వే బృందాలు ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. తద్వారా రైతులందరికీ భూహక్కు పత్రాలను సక్రమంగా అప్పగించడంతో పాటు లిటిగేషన్లకు అవకాశం లేకుండా ఉంటుందన్నారు. భూసర్వే చేసే ముందుగా ప్రతి రైతుకు కచ్చితంగా సమాచారాన్ని అందించాలని ఆమె తెలిపారు. మ్యూటేషన్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి జాషువా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- శ్రీవారి క్షేత్రంలో శరవేగంగా ఏర్పాట్లు
- విద్యుద్దీప కాంతులీనుతున్న ఆలయం
- 24 నుంచి ఉత్సవాలు ప్రారంభం



విద్యుద్దీప కాంతులీనుతున్న ఆలయ రాజగోపురాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోపురాలు, తూర్పు వైపు అనివేటి మండపం, చెట్లు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. దర్శనం క్యూలైన్లు, రాజగోపురాల పేర్లను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. గుడి సెంటర్‌లో 40 అడుగుల స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 24 నుంచి 29 వరకు జరిగే చినవెంకన్న ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

క్లుప్తంగా

కులప్రాతిపదికన జనగణన నిర్ణయం పట్ల హర్షం


బిరుదుకోట చింతన్న

తణుకు: రాష్ట్రంలో కులప్రాతిపదికన జనగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, జిల్లా కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కులాల వారీగా వారి సంఖ్య నిరూపించుకోవడం తోపాటు రాష్ట్రంలో వారి వారి ఉనికి చాటేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చేశారు.

మహిళా కళాశాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

తణుకు టౌన్: ఇజ్రాయెలు, పాలస్తీనా దేశాల మధ్య కొనసాగుతున్న బీకరయుద్ధం నిలిపివేసి శాంతియుత పోరాటం చేయాలని కోరుతూ తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీలు గురువారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ యుద్ధం కారణంగా అమాయక ప్రజల ప్రాణాలు హరిస్తున్నారని, ఇది మరింత ప్రపంచ యుద్ధంగా మారక ముందే ప్రపంచ దేశాలు యుద్ధాన్ని నిలిపే ప్రయత్నాలు చేపట్టాలని కోరారు. అనంతరం తణుకు నరేంద్ర సెంటర్‌లో విద్యార్థినీలు మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ యూ లక్ష్మీసుందరిబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్న బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలతో విజ్ఞానం సముపార్జన చేయవచ్చని పలువురు వక్తలు తెలిపారు. దసరా సెలవుల సందర్భంగా నాల్గోరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం గ్రంథాలయంలో నిర్వహించారు. విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి బాపయ్య శర్మ, హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్‌లు ఇంగ్లీషు గ్రామర్‌తో పాటు ఇంగ్లీషు పుస్తకాలు చదివించడం, జనరల్ నాలెడ్జి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువులతో పాటు మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మెచ్చే విధంగా తయారు కావాలని సూచించారు. పథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాస రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, చదవరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన


బ్యాలెట్ లెక్కింపు నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికీ సాగనంపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని కోరుతూ పట్టణంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌ను గురువారం లెక్కించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారుల నుంచి అధికంగా రుసుం వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి కృష్ణ, మడకరాజు, వామపక్షాల సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విద్యుత్ సమస్యల పరిష్కారం

ఆకివీడు: విద్యుత్ బిల్లుల్లో సమస్యల పరిష్కారానికి వినియోగదారుల ముంగిటే పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు ఏడీఏ ఎల్‌వీ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశ్రాంతి న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ సమక్షంలో వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చునని చెప్పారు. లోటల్టేజ్ సమస్యతో పడుతున్న ఇబ్బందులపై కూడా సమావేశంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. విద్యుత్ బిల్లుల లోపాలతో ఆర్థిక భారం ఏర్పడుతుందని తెలియజేసిన వినియోగదారుల బిల్లుల్ని క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక విద్యుత్ సిబ్బందితో చర్చిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో సదస్సును శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు రూరల్ ఏఈ ప్రసాదరాజు చెప్పారు.

ప్రజల కోసం ఆరోగ్య సురక్ష


తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్


తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో చెన్నయ్య

పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

తాడేపల్లిగూడెం రూరల్: పేదలకు గ్రామ స్థాయిలోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తుందని ఆర్డీవో చెన్నయ్య అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ బేతపూడి వెంకటసుబ్బలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు, మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించాలన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన రోగులను ఉన్నత వైద్యం అవసరమైతే ఆసుపత్రులకు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం 1052 మందికి వైద్యులు ఏవీ.వెంకటేష్, జి.రూపాదేవి, టి.గౌతమి, టి.సూర్యసుభాషి, ప్రియాంక వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎమ్పీటీసీ గంజి భవానీ, పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, తాడేపల్లి పండు, గారపాటి చిట్టిబాబు, ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వోలు కే.బాబ్జీ, కేవీఎస్.ప్రసాద్, ఎ.సత్యవాణి, వి.రామతారకం, పి.దివ్య జ్యోతి, రూతు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


పెంటపాడు : అలంపురం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చెన్నయ్య


అత్తిలి: గుమ్మంపాడులో రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు సంజీవని వంటిదని ఆర్డీవో చెన్నయ్య పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం గురువారం అలంపురం సచివాలయం -2 పరిధిలో నిర్వహించారు. గ్రామ సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ దత్తుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆర్డీవో చెన్నయ్య పరిశీలించారు. పలువురికి సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం వైద్యసేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచితవైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ సత్యనారాయణరాజు (దత్తుడు)లు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష వల్ల ప్రతి పేదవానికి ఉచిత వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దెందుకూరి సూర్యనారాయణరాజు, పెనుమర్తి తాతారావు, కాశీ, రాపాక కుమారి, కొలనువాడ సీతారామరాజు, మురళి, ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ పూజిత, డాక్టర్ ఎస్వీ రమణ, గ్రామ కార్యదర్శి బాబు, ప్రత్యేక వైద్యులు విజయ్ కుమార్, వంశీ(ఆర్థో), కంటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. గురువారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందిస్తున్నారని, శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లాప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మండల బీసీసెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, వైద్యులు పి కిరణ్, కె నాగరాజు, శ్రీహర్ష, ఆర్ దివ్య, కె సాయిబాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి శ్రీదేవి, పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు అనారోగ్య సమస్యలను తొలగించేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, ప్రజలు విరివిగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు ఇంచార్జి చామన సూర్యచంద్రరావు అన్నారు. ప్రభుత్వం, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు పట్టణంలోని సంజీవనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం 12వ వార్డుకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పాతూరులోని 200 మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు జరిగాయి. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రవికుమార్, వైద్య బృందం డాక్టర్లు శ్వేత శ్రీ, సతీష్, ఆశాలత, అమృత, చైతన్య, శ్రావ్య, ఏఎస్ఓ సురేష్, పురపాలక, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నాయకులు ఆరిమిల్లి రవి, చామన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


రామన్నగూడెం గ్రామంలో దోమల నివారణపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు వ్యాధులపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పొడి వాతావరణం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శులు అనపూర్ణ, దానమ్మ, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ నాగేశ్వరరావు, ఆశాలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రత్నాజీ, వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు, పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్, కొండయ్య చెరువు సబ్ స్టేషన్ పరిధిలలో 33/11 కేవీ ఫీడర్స్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వన్‌టౌన్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. కె.ఎస్.రోడ్డు, మునిసిపల్ ఆఫీస్ ఏరియా, తాలూకా ఆఫీస్ సెంటర్, మసీద్ సెంటర్, పీ అండ్ టీ కాలనీ, మహాలక్ష్మీనగర్, సత్యవతినగర్, అమ్మకాలనీ, ఏరియా ఆసుపత్రి రోడ్డు, కొండయ్య చెరువు, వీకర్స్‌కాలనీ, గాంధీ బొమ్మ సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దసరా ఉత్సవం..అంగరంగ వైభవం..

తణుకు టౌన్: దేవీ నవరాత్రి వేడుకల్లో భాగంగా ఐదవరోజు తణుకు మండలంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లను మహా ఛండీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం దువ్వ గ్రామంలోని శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, ఈవో ముత్యాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న శ్రీ యల్లారమ్మ అమ్మవారిని మహా ఛండీ దేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, సభ్యులు పాల్గొన్నారు.

చాముండేశ్వరిగా శ్రీకామాక్షి దేవి...

తణుకు అర్బన్: దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీకామాక్షి దేవి అమ్మవారు గురువారం చాముండేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. పట్టణ స్వరకార సంఘం అధ్యక్షులు పొడుగు రామాచారి (రాము) ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాధికాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, వైస్ చైర్మన్ దవళేశ్వర సుబ్బారావు, కమిటీ సభ్యులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

స్కంధ మాతగా దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరీ దేవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం వీరంపాలెం శ్రీబాలాత్రిపురసుందరీ విద్యా, ఆధ్యాత్మిక పీఠంలోని అమ్మవారు దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం స్కంధ మాతగా అలంకరించారు. మండలంలోని ఆరుగొలను గ్రామంలో శ్రీవిజయదుర్గమ్మ వారిని లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించారు.

పట్టణంలో వైభవంగా దసరా మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ):దసరా మహోత్సవాలు ఐదోవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద ఉత్సవ అమ్మవారిని మహాచండీదేవిగా విశేష అలంకరణ చేశారు. శ్రీ వాసవి పంచాయతన క్షేత్రంలో వాసవి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగాను. స్థానిక శంకరమఠంలో వేంచేసియున్న సర్వమంగళమ్మ వారిని శ్రీ చండీదేవిగాను విశేష అలంకరణలు చేశారు.


తణుకు అర్బన్: చాముండేశ్వరి అలంకరణలో శ్రీకామాక్షి దేవి


తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వారిని మహాలక్ష్మిదేవిగా అలంకరించిన దృశ్యం


తాడేపల్లిగూడెం (టీఓసీ):శ్రీ చండీదేవిగా సర్వమంగళమ్మ


పెంటపాడు: చండీదేవిగా కాగులంపాడు కనకదుర్గమ్మ

చండీదేవిగా కనకదుర్గమ్మ

పెంటపాడు: మండలంలోని పలు ఆలయాలలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని చండీ దేవిగా అలంకరించారు. వై.జంక్షన్‌లోని దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేశారు.

ఆకర్షణీయంగా స్వయం సహాయక సంఘాల స్టాల్స్


తణుకులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతివృత్తుల స్టాల్

తణుకు అర్బన్: స్వయం సహాయక సంఘ సభ్యుల చేతివృత్తుల సామాగ్రి ఆకర్షణగా ఉన్నాయని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని కోర్టు ప్రహరీ వద్ద తణుకు మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన వివిధ రకాల చేతివృత్తుల సామాగ్రికి సంబంధించిన స్టాల్స్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతివృత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వం ద్వారా వివిధ రుణాలు తీసుకుని తయారుచేస్తున్న సామాగ్రి, గృహోపకరణాలు, దుస్తులు ఎంతో సుందరంగా ఉంటున్నాయన్నారు. సామాగ్రి విక్రయాలతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, ప్రజలు కూడా వీటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు దుస్తులు, చీరలు, మొక్కల కుండీలతో మొక్కలు, పాదరక్షలతోపాటు ఆహా క్యాంటీన్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఎం.రమేష్ బాబు, సీఎల్ఆర్పీ, ఆర్పీలు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్ కుటుంబం


దెయ్యాలతిప్ప గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: రైతులను నాడు, నేడు ఆదుకున్నది వైఎస్ కుటుంబమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామంలో రూ.21 లక్షల 80 వేల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, హరిజన పేటలో రూ.11 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, రూ.10 లక్షలతో నిర్మించిన మరో సీసీ రోడ్డును, రూ.12 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి కియోస్క్ యంత్రం ద్వారా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతిక మార్పులు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయడమే కాక, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అందించి అధిక దిగుబడే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. అంతేకాక పెట్టుబడి నిధి కింద రైతు భరోసా ద్వారా రూ.13 వేల 500, సున్నా వడ్డీ, పండించిన ధాన్యాన్ని సరిన్న మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయడం వంటి చేపడుతున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా సాగులో నష్టపోతే పంటల బీమా ద్వారా నష్టపరిహారాన్ని చెల్లించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రైతులకు ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు, రైతు రుణమాఫీ వంటివి రైతుల మేలు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రవికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

గ్రామ గ్రామానా మంత్రి 'కొట్టు' జన్మదిన వేడుకలు


మంత్రి కొట్టు సత్యనారాయణను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పెంటపాడులో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కొట్టు విశాల్, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని గ్రామ గ్రామాన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథపురం, ఎల్.అగ్రహారం, నీలాద్రిపురం, కృష్ణాపురం, పుల్లాయగూడెం తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి, మంత్రి కొట్టు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులతో పాటు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఆకాంక్షించారు. జగన్నాథపురం గ్రామంలోని దళిత వాడలతో పాటు మిగిలిన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, సొసైటీ పర్సన్ చిట్టూరి బాపన్న, పంచాయతీ కార్యదర్శులు కే.శ్రీనివాసరెడ్డి, టి.పవన్‌కుమార్, నాయకులు అడ్డాల గోపీ కృష్ణ, ఉండ్రాజవరపు రాజు, మస్తాన్, ముప్పిడి లక్ష్మణరావు, నీలం నాగేశ్వరరావు, కరిపోతు పుల్లారావు నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, శీలంశెట్టి బాలాజీ, లింగంపల్లి వేమన, సొసైటీ చైర్మన్ గుమ్మళ్ళ తాతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాతూరులో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా పాతూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు ఇంచార్జిలు ఆధ్వర్యంలో సంజీవనగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సమక్షంలో బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. మంత్రి కొట్టు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. వార్డు ఇంచార్జి చామన సూర్యచంద్రరావు, గృహ సారథులు చామన ప్రసాద్, మేరీ, వలంటీర్లు, సచివాలయం అడ్మిన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో...

తాడేపల్లిగూడెం అర్బన్ : ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాష్ట్రంలోని అన్నవరం, ద్వారకా తిరుమల వివిధ ప్రముఖ దేవస్థానాల అధికారులు, అర్చక సిబ్బంది కొట్టును ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిటిడ్కో లబ్ధిదారులకు కొందరికి గృహాల తాళాలను అందచేశారు. మున్సిపల్ ఉద్యోగులకు యూనిఫారాలను, పారిశుద్ధ్య రక్షణ సామాగ్రిని అందచేశారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు కొట్టును కలిసి శుభాకాంక్షలు తెలిపి గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణం, గూడెం, పెంటపాడు మండలాల నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కొట్టు జన్మదినోత్సవ వేడుకలు

పెంటపాడు: మండలంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదినోత్సవ వేడుకలు గురువారం ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదినోత్సవం సందర్భంగా మండల పార్టీ నాయకులు సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ నాయకులు ములగాల రామసత్యనారాయణ, గుండుమోగుల సాంబయ్య, వీర్ల గోవింద్ తదితరులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 300 మంది పేదలకు, వితంతువులకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, పార్టీ బీసీసంఘ నాయకులు, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.